



ఏనుగుల తరలింపుపై..

పంటలను నాశనం చేస్తున్న ఏనుగుల గుంపు



కొమరాడ మండలంలో అంతర్ రాష్ట్ర హైవే దుస్థితి

ఎన్నాళ్లీ సమస్యలు?

- ఆంధ్రా-ఒడిశా మధ్య సరిహద్దు వివాదాలు
- ఏళ్లుగా పరిష్కారం కాని వైనం
- ఆగిన జంఝావతి రబ్బరు డ్యామ్
- దారుణంగా మారిన అంతర్ రాష్ట్ర రోడ్డు
- ఇసుక రీచ్‌పై గొడవ
- ఏనుగులు తరలించడంలోనూ..
- కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

అంతర్ రాష్ట్ర సమస్యలతో జిల్లా ఉక్కిరిబిక్కిరవుతోంది. ఇప్పటికే సాలూరు మండలంలోని కొఠియా గ్రామాలపై ఒడి శాతో వివాదం నడుస్తోంది. ఈ వ్యవహారం న్యాయస్థానంలో ఉంది. ఈ సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో, ఎప్పుడు కొఠియా గ్రామాలు పూర్తిస్థాయిలో ఆంధ్రాలోకి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఒడిశా మొండి వైఖరితో ఈ సమస్య రోజురోజుకు జటిలమవుతుంది. ఇప్పుడు కొత్తగా ఇసుక సమస్య ప్రారంభమైంది. భామిని మండలంలో ఒడిశా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇసుకరీచ్‌లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందినవి. అయినప్పటికీ అవి తమవేనని ఒడిశా చెబుతోంది. ముఖ్యంగా ఇలాంటి అంతర్ రాష్ట్ర సమస్యలు కొమరాడ మండలంతో ఎక్కువగా ముడిపడి ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కూటమి ప్రభుత్వంలోనే ఈ సమస్యలు పరిష్కార మవుతాయని జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి/ జియ్యమ్మవలస)

జిల్లాలో ఆంధ్ర- ఒడిశా సరిహద్దులు కలిగిన మండలాలు సాలూరు, పాచిపెంట, మక్కువ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, భామిని, కొమరాడ ఉన్నాయి. ఈ ఏడు మండలాల్లో సాలూరు, కొమరాడ మండలాలకు సంబంధించి ఒడిశాతో వివాదాలు ఉన్నాయి. అయితే, ఎక్కువ అంతర్రాష్ట్ర సరి హద్దు సమస్యలు ఉన్న ఏకైక మండలం కొమరాడ మాత్రమే. ఈ మండలంలో 21 గ్రామాలు ఉన్నాయి.

ఇసుక రీచ్‌పై వివాదం..

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని భామిని మండలం దిమ్మిడిజోల వద్ద వంశధార నదీ తీరంలో ఇసుక తవ్వకాలకు ఒడిశా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ ర్యాంపు ఆంధ్ర భూ భాగమని రాష్ట్ర అధికారులు, కాదు ఒడిశా భూభాగం అని ఆ రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. లివిరి రెవెన్యూ గ్రామంలో 333 సర్వే నెంబర్‌లో దిమ్మిడిజోల వద్ద ఉన్న 579 ఎకరాలు తమవేనని మన అధికారులు చెబుతున్నా వారు వినడం లేదు. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తోంది.

సారాను కట్టడి చేయలేకపోతున్న ఒడిశా..

ఒడిశా నుంచి జిల్లాకు సారా అక్రమంగా రవాణా అవుతోంది. ఆ రాష్ట్రంలో సారా తయారీని అడ్డుకోవడంలో అక్కడి ప్రభుత్వం విఫలమ వుతుంది. దీంతో సరిహద్దు గ్రామాల నుంచి సారా మన రాష్ట్రంలోకి ఇష్టారాజ్యంగా రవాణా జరుగుతోంది. గంజాయి కూడా ఒడిశా నుంచి జిల్లాలోకి రవాణా చేసున్న సంఘటనలు ఇటీవల వెలుగుజూశాయి.

పూర్ణపాడు - లాబేసు వంతెన

అంతర్ రాష్ట్ర సమస్యలతో పాటు కొమరాడ మండలంలో పూర్ణపాడు - లాబేసు గ్రామాల మధ్య వంతెన నిర్మాణం దాదాపు దశాబ్ద కాలం పాటు కలగానే ఉండిపోయింది. ఈ మండలంలో మొత్తం 31 పంచాయతీలు ఉంటే నాగావళి నది ప్రవాహంతో నదికి తూర్పు వైపు 9 పంచాయతీలు, పడమర వైపు 22 పంచాయతీలు ఉండిపోయాయి. తూర్పు వైపున ఉన్న 9 పంచాయతీల్లోని 45 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నుంచి ఈ గ్రామాలకు అధికారులు రావాలన్నా, ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలన్నా దాదాపు 50 కిలో మీటర్లు ప్రయాణించాల్సిందే. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ మండలవాసులకు ఎటువంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి రవాణా వ్యవస్థ, వాణిజ్యం, వ్యాపారాల పరిస్థితి మెరుగుపడుతుంది. 2015లో టీడీపీ ప్రభుత్వం రూ.14కోట్లతో వంతెన పనులు ప్రారంభించి 70 శాతం పూర్తి చేసింది. మిగిలిన 30 శాతం పనులు పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వమే ఈ పనులు పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా ఉండటంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దీనికి కొత్త ఎస్టిమేట్లు వేసే పనిలో అధికారులు ఉన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఈ వంతెనను స్వయంగా పరిశీలించారు.



ఆంధ్ర - ఒడిశా వివాదంలో ఉన్న జంఝావతి ప్రాజెక్టు

జంఝావతి ప్రాజెక్టు..

ప్రధాన అంతర్ రాష్ట్ర సమస్య జంఝా వతి ప్రాజెక్టు. 1976లో కొమరాడ మండలం రాజలక్ష్మీపురం వద్ద జంఝావతి నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిద్వారా పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, సీతానగరం, మక్కువ మండలాల్లోని 75 గ్రామాల పరిధిలో ఉన్న 24,640 ఎకరాల ఆయకట్టుకు సాగునీ రందించేలా పనులు ప్రారం భించారు. అయితే, దశాబ్దాలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో 9 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సాగునీటి వివాదాల తో ఈ ప్రాజెక్టు అసంపూర్తిగా ఉండిపోయింది. 1976 సెప్టెంబరు 24, 1978 డిసెంబరు 15 తేదీల్లో ఆంధ్ర - ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంతర్ రాష్ట్ర సమావేశాలు ఏర్పాటు చేసుకొని ప్రాజెక్టులో నీరు 8 టీఎం సీలుగా నిర్ధారించి చెరో 4 టీఎంసీల వాడుకునే విధంగా ఒప్పందం చేసుకున్నారు. తరువాత 1980 జూలై 27, 2002 జనవరి 29, 2002 డిసెంబరు 23న ఇరు రాష్ట్రాల ప్రభుత్వ కార్యదర్శులు భువనేశ్వర్‌లో సమావేశమై ముంపు ప్రాంత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందు కు అంగీకరించుకున్నారు. 848.76 ఎకరాల ప్రభుత్వ భూమి, 326.34 ఎకరాల ప్రైవేటు భూమి కలిపి మొత్తం 1175.10 ఎకరాలు ముంపు ప్రాంతంగా గుర్తించారు. 4 గ్రామాలు పూర్తిగా, మరో గ్రామాలు పాక్షికం గా ముంపునకు గురవుతాయని, 189 కుటుంబాలు నిర్వాసితులుగా మారుతారని గుర్తించారు. వీరికి పూర్తిస్థాయిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి, మెరుగైన పరిహారం ఇచ్చేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రభు త్వం పూర్తి అంగీకారం తెలిపింది. వృథాగా పోతున్న నీటిని ఒడిసి పట్టు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2005-06లో రూ.6కోట్లతో రబ్బరు డ్యాం నిర్మించింది. కోట్లు వెచ్చించినా తగిన ఫలితం లభించలేదు. దీంతో 2007 సెప్టెంబరు 18న ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా కలెక్టర్ ద్వారా, మళ్లీ 2009 సెప్టెంబరు 8న ఒడిశా ప్రభుత్వం ఆంధ్ర ప్రభుత్వానికి మరి గ్రామసభలు నిర్వహించ వద్దని తేల్చి చెప్పింది. తరువాత 2011లో, 2020లో రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా ప్రయో జనం లేకపో యింది. తరువాత 2021లో మళ్లీ ఇరు రాష్ట్ర సీఎంలు సమా వేశమై మాట్లాడినా ప్రయో జనం లేకపోయింది. దీంతో ఈ ప్రాజె క్టు అసంపూర్తి గానే ఉండి పోయింది.

ఛిద్రమైన అంతర్ రాష్ట్ర రహదారి..

ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు సంబంధించి అంతర్ రాష్ట్ర ప్రధాన రహదారి (ఎస్‌హెచ్-004) కొమరాడ మండలం మీదుగా ఉంది. ఇది చిలకపాలెం - రామభద్రపురం - రాయఘడ రోడ్డు. దీని పొడవు 23.2 కిలో మీటర్లు. అయితే, పార్వతీపురం నుంచి ఆంధ్ర - ఒడిశా బోర్డర్ కూనేరు వరకు ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయం. ఎక్కడికక్కడే గోతులు, రాళ్లతో ఛిత్రమైంది. దీంతో ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. గోతుల్లో వాహనాలు దిగబడటం, గంటల తరబడి రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోవడం పరిపాటిగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు మరమ్మతులను కనీసం పట్టించుకోలేదు. దీంతో మరింత దారుణంగా తయారయ్యింది. దీనిపై ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.కొండబాబు, జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ఈ నెల 20న అంతర్ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. రహదారి తాత్కాలిక మరమ్మతులకు జిల్లా కలెక్టర్ రూ.2.07 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అలాగే, కోటిపాం వద్ద జంఝావతి బ్రిడ్జి నిర్మాణానికి రూ.11.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

ఏనుగుల తరలింపుపై..

మరో సమస్య గజరాజులు. 2001-02లో ఒడిశాలోని లఖేరీ అభయారణ్యం నుంచి వచ్చిన ఏనుగుల గుంపును మళ్లీ ఒడిశాలోని అదే అడవులకు తరలించడం పెద్ద సమస్యగా మారింది. అవి ఆంధ్ర రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లాలో జియ్య మ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లో తిష్ట వేసి మనుషులను చంపుతూ, పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వీటిని కొమరాడ మండలం మీదుగా ఒడిశా రాష్ట్రంలోకి రెండు, మూడు సార్లు అటవీశాఖ తరలించే ప్రయత్నం చేసింది. కానీ, బోర్డర్ ప్రాంతంలో ఉన్న ఒడిశా ఆదివాసీలు బాంబులతో వాటిని బెదిరిస్తూ ఆంధ్రా వైపే పంపించేస్తుండటం పెద్ద సమస్యగా మారింది. ఈ విషయంపై కూడా ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడాల్సి ఉంది.



ఢీకొన్న ఎస్కార్ట్ వాహనం, వ్యాన్

మంత్రి ఎస్కార్ట్ వాహనానికి ప్రమాదం

- 8 మందికి గాయాలు.. క్షతగాత్రుల్లో పోలీసులు
- గుమ్మిడి సంధ్యారాణికి త్రుటిలో తప్పిన అపాయం
- రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఘటన

రామభద్రపురం, సెప్టెంబరు 12: ఆరికతోట సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ఉదయం గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఎస్కార్ట్ వాహనం, వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఆమెకు త్రుటిలో అపాయం తప్పింది. మంత్రి సంధ్యారాణి సాలూరు నుంచి మెంటాడ ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతుండగా ఆరికతోట వైపు నుంచి వస్తున్న వ్యాన్, మంత్రి ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు.

ఎస్కార్ట్ వాహనంలో ఉన్న ఏఆర్ ఎస్ఐ కేవీ రమణ, ఏఆర్ హెచ్‌సీ పి.సునీల్, ఏఆర్ పీసీలు ఆర్.గణపతి, ఎం.మహేష్, ఎస్కార్ట్ వాహన డ్రైవర్ ఏవీవీఎస్ఎన్ రాజులకు గాయాలయ్యా యి. వీరిని 108లో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ బుగత త్రినాథరావు, బోను గౌరమ్మ, కడుగండి సీతమ్మలకు కూడా గాయాలయ్యాయి. వీరిలో డ్రైవర్ త్రినాథరావును బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మిగతా ఇద్దరిని ఆరికతోట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఎస్కార్ట్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెలమల ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఇంజన్ భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. సంఘటనా స్థలాన్ని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు పరిశీలించి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఫోన్‌లో హోంమంత్రి పరామర్శ..

విజయనగరం క్రైం: ఎస్కార్ట్ పోలీసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీసు అధికారులను ఆదేశించారు. గాయపడిన పోలీసులతో గురువారం ఫోన్‌లో పరామర్శించిన హోం మంత్రి వారికి భరోసా కల్పించారు. నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి మానసిక ధైర్యాన్ని కల్పించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

పరామర్శించిన మంత్రి సంధ్యారాణి

రింగురోడ్డు: ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్కార్ట్ పోలీసులను మంత్రి సంధ్యారాణి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు.

ఊపిరిపీల్చుకున్న జిల్లా ప్రజలు..

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: మంత్రి సంధ్యారాణి కాన్వాయ్ ప్రమాదానికి గురైందని విషయం తెలియగానే జిల్లా వాసులు ఉలిక్కిపడ్డారు. అయితే, ఆమెకు ఎటువంటి ప్రమాదం జరగలేద ని తెలుసుకుని జిల్లా ప్రజలతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు ఊపిరిపీల్చుకున్నారు. గురువారం సాయంత్రం మంత్రి సంధ్యారాణి స్వగృహానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు చేరుకుని క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే బయటపడ్డా..

ప్రజలు, దేవుని ఆశీర్వాదంతోనే నేను ప్రమాదం నుంచి బయటపడ్డాను. ప్రమాదాలు గురించి వినడమే తప్ప స్వయంగా చూసిన సందర్భాలు లేవు. అలాంటిది నా కళ్ల ముందే జరిగిన ఈ ప్రమాదాన్ని తలచు కుంటూనే భయమేస్తుంది. లారీ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన పోలీసులు వేగవంతంగా కోలుకోవాలని భగవంతుడిని కోరుతున్నాను. సకాలంలో నా సిబ్బంది సహకారంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడం సాధ్యమైంది.

-గుమ్మడి సంధ్యారాణి,
రాష్ట్ర గిరిజన శాఖామంత్రి




ప్రమాదానికి గురైన బాధితులను పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

సెబ్ విలీనంపై హర్షాతిరేకాలు

- సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 12: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)ని ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ శాఖ అధికారులు, సిబ్బంది హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం, పూలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సీఐ నర్సింహమూర్తి, ఎస్ఐ పద్మావతి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2020లో సెబీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ మేరకు 12 జీవోలను జారీ చేసిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటన్నిటినీ రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులను జారీ చేశారన్నారు. దీన్ని మళ్లీ ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడం సంతోషదాయకమన్నారు. ఇక మీదట ఎక్సైజ్ శాఖగానే పరిగణిస్తూ గతంలో ఉండే అధికారాలు, విధులు వర్తింపజేశారని అన్నారు. ఇక నుంచి సారా తయారీ, రవాణాపై నిఘా పెట్టి నివారిస్తామని తెలిపారు.



సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పాఠశాలలను విధిగా సందర్శించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారులు పాఠశాలలను విధిగా సందర్శించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించా రు. మైస్కూల్ మై ఫ్రెండ్ కార్య క్రమంపై పాఠశాల ప్రత్యేక అధికా రులు, ఎంపీడీవోలు, ఎంఈవోలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు రోజులు పాఠశాలలను సందర్శించా లని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతీ విద్యార్థి సక్రమంగా పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలన్నారు. నాణ్యమైన విద్యా బోధన, మంచి మార్కులు సాధనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇటీవల జరిగిన సమ్మెటివ్ పరీక్షలను ఆధారంగా చేసుకొని విద్యార్థులు ఏ అంశంలో వెనుకబడి ఉన్నారో పరిశీలించాలన్నారు. ప్రతి సబ్జెక్ట్‌కు ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవా లన్నారు. సెల్‌ఫోన్లు, బయట ఆహారం పాఠ శాలలకు తీసుకురాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డెరక్టర్ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

'ప్రధానమంత్రి జన్‌మన్' తుది నివేదిక అందించాలి..

ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం కింద గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పంపిన ప్రతిపాదనలపై విచారణ చేపట్టి తుది నివేదిక అందించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదే శించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పుడు అందించే నివేదిక ఆధారంగానే పథకాలు మంజూరు అవుతాయని తెలిపారు. ప్రతి గ్రామానికి కావాల్సిన ఇళ్లు, రహదారులు, వెల్ నెస్ సెంటర్లు, పాఠశాలలు, మొబైల్ టవర్లు, విద్యుత్, తాగునీరు, అంగన్వాడీ సెంటర్లు వంటి 11 అంశాలకు సంబంధించి మండల అధికా రుల నుంచి అందిన ప్రతిపాదనలు గూర్చి వివ రించారు. 'జిల్లాలో 8,283 మందికి ఇళ్లు అవస రం కాగా 5,874 మందికి మంజూరు చేశాం. మిగిలిన వారి వివరాలపై విచారణ చేపట్టాలి. వారితో పాటు ఇంకా ఎవరికైనా ఇళ్లు అవసర మని గుర్తిస్తే వారిని కూడా జాబితాలో చేర్చాలి. ఇంకా 63 హెబిటేషన్లలోని 13,203 ఇళ్లకు మంచి నీటి సదుపాయం, 215 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ప్రతిపాద నలు వచ్చాయి. వాటిని పరిశీలించి తుది నివే దిక సమర్పించాలి.' అని కలెక్టర్ ఆదే శించారు. జేసీ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కేశవనా యుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజె క్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూ ఎస్ ఇంజనీర్ అధికారి ప్రభాకరరావు, జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ పాల్గొన్నారు.

జీసీసీకి పూర్వవైభవం వచ్చేనా?

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- దశాబ్దాలుగా భర్తీకాని పోస్టులు
- అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కరువు
- నేడు ఎండీని కలవనున్న ఉద్యోగులు

సీతంపేట: గిరిజన సంక్షేమ శాఖకు అనుబంధంగా పనిచేస్తోన్న గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ)లో మూడు దశాబ్దాలుగా ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదు. ఒప్పంద ఉద్యోగులతోనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించలేని పరిస్థితి నెలకొంది. విశాఖపట్నం కేంద్రంగా జీసీసీ పని చేస్తోంది. దీని పరిధిలో సీతంపేట, పార్వతీపురం డివిజనల్ కార్యా లయాలు, ఐదు సొసైటీలు ఉన్నాయి. స్వయం ప్రతిపత్తి సంస్థగా ఉన్న జీసీసీ.. మేనేజింగ్ డైరక్టర్, చైర్మన్ స్థాయి అధికారి పర్యవేక్షణలో నడుస్తుంది. ఈ సంస్థ ప్రతి ఏడాది రూ.500 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటుంది. అయితే, 1991 నుంచి ఈ సంస్థలో ఎలాంటి కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ సంస్థలో ఎందరో పదవీవిరమణ, వాలంటీర్ రిటైర్మెంట్ చేసిన వారు ఉన్నారు. కానీ, ఆ స్థానాలను మాత్రం భర్తీ చేయడం లేదు. పార్వతీపురం, శ్రీకాకుళంలో 156 జీసీసీ డిపోలు ఉన్నాయి. మొత్తం 400 సిబ్బంది ఉండాలి. కానీ, సగంమంది కూడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం 22 మంది రెగ్యులర్ సేల్స్‌మెన్లు, 156 మంది ఒప్పంద సేల్స్‌మెన్లు పని చేస్తున్నారు. దీంతో ఒక్కొక్కరికి రెండు మూడేసి డిపోల బాధ్యతలను అప్పగించారు. కొన్నిచోట్ల సేల్స్‌మెన్లు లేక డిపోలను ఎత్తేశారు. డివిజనల్ మేనేజర్లు ఇద్దరు, సొసైటీ మేనేజర్లు ఐదుగురు ఉండాల్సి ఉంది. కానీ, ఈ పోస్టులను భర్తీ చేయకపోవడంతో సూపరింటెండెంట్లే మే నేజర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే, పొరుగు జిల్లాలకు చెందిన కొందరు కీలక అధికారులు కూడా తమ సేవల ను అందిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని గతంలో ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపించినప్పటికీ ఫలితం శూన్యం. మరో పక్క ఏన్నో ఏళ్లుగా పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు పదోన్నతులు కూడా కల్పించడం లేదు. అలాగే, కారుణ్య నియమకాలు కూడా చేపట్టడం లేదు. కూటమి ప్రభు త్వం స్పందించి జీసీసీకి పూర్వ వైభవం తీసుకురావాలని సిబ్బంది కోరుతున్నారు. శుక్రవారం విశాఖలోని జీసీసీ మేనేజింగ్ డైరక్టర్‌ను కలసి తమ సమస్యలను చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయంపై జీసీసీ మేనేజర్ వివరణ కోరగా.. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, రెగ్యులర్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని ఎండీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



సీతంపేటలోని జీసీసీ సొసైటీ

సూపర్ హీరోల ప్రేమకథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ హీరో నాని చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఇది మార్వెల్ సూపర్‌హీరో సినిమా కాదు. ఈ సినిమాలో హీరోకి ఉండే పవర్ పేరు ప్రేమ. ఇద్దరు సూపర్ హీరోల మధ్య జరిగే లవ్ స్టోరీ ఇది. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేస్తూ చూసేలా ఉంటుంది' అన్నారు. అభిలాష్ మాట్లాడుతూ 'తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రాసుకున్న అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. మా టీం చాలా కష్టపడింది. అందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ ఆర్ణ తెలిపారు. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉందని సునీల్ చెప్పారు.



ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 50 లక్షల విరాళం ప్రకటించిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సీఎం చంద్రబాబునాయుడును కలిసి చెక్కును అందజేశారు. అలాగే రూ. 50 లక్షలు విరాళంగా ప్రకటించిన వెంకట్ అక్కినేని, రూ. 15 లక్షల సాయం ప్రకటించిన సిద్ధు జొన్నలగడ్డ, రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటించిన విష్వక్‌సేన్ సీఎంను కలిసి చెక్కులు అందజేశారు.

ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం

'ఈ సినిమాతో అందరికీ ఎమోషనల్ కనెక్షన్ ఉంది. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ఆసక్తితో అందరూ పని చేశారు. నేను సలహాలు ఇవ్వడం వరకే కానీ నిజానికి కష్టపడింది మాత్రం టీమే. వీళ్ల కష్టానికి తగిన ఫలితం మంచి హిట్ ద్వారా వస్తుందని బలంగా కోరుకుంటున్నాను' అన్నారు దర్శకుడు మారుతి. రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన పాల్గొన్నారు. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ ' మా సినిమాకు అతి ముఖ్యమైన వ్యక్తి దర్శకుడు శివసాయి. మారుతిగారు చెప్పిన పాయింట్‌ను అద్భుతంగా తెరకు ఎక్కించారు. పని రాక్షసుడు. నన్ను చాలా కొత్తగా



చూపించాడు. గ్రేట్ డైరెక్టర్ సింగీతం గారితో కలసి పని చేయడం గొప్ప అనుభూతి' అన్నారు. తన పదిహేనేళ్ల కలను నిజం చేసిన మారుతికి దర్శకుడు శివసాయి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రమిదని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

పాటల ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయిన గురుచరణ్



'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిల', 'ముసిముసి నవ్వుల లోన..' 'నీక్కావాల్సింది నా దగ్గర ఉంది' వంటి మెలోడీ సాంగ్స్ రాసిన గురుచరణ్ (77) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం కన్నుమూశారు. గురుచరణ్ అసలు పేరు మానాపురం రాజేంద్రప్రసాద్. ఎన్టీఆర్, శోభన్‌బాబు నటించిన పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన పాత తరం దర్శకుడు మానాపురం అప్పారావు తనయుడే ఈ రాజేంద్రప్రసాద్. వాళ్ల అమ్మగారు ఎం.ఆర్. తిలకం కూడా నటీమణే. (ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రంలో 'పోవు చున్నావా యమధర్మ రాజా' పాట పాడింది ఆవిడే) ఎం.ఎ. చదివిన గురుచరణ్ ప్రముఖ గీత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. గురువు మీద గౌరవంతో 'గురుచరణ్' అని తన పేరు మార్చుకుని, ఆ పేరుతోనే పరిశ్రమలో కొనసాగారు. మోహన్‌బాబు నిర్మించిన 'అల్లుడు గారు' గీత రచయితగా గురుచరణ్ తొలి చిత్రం. 'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు' ఆయన రాసిన తొలి పాట. గురుచరణ్ అంటే మోహన్ బాబుకు ఎంతో అభిమానం. తను నిర్మించిన ప్రతి చిత్రంలోనూ గురుచరణ్‌తో కనీసం ఒక పాటన్నా రాయించేవారు. రెండు వందలకు పైగా పాటలు రాసిన గురుచరణ్ కొన్ని అనువాద చిత్రాలకు మాటలు కూడా రాశారు. గురుచరణ్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

నిదుర కుదురు చెదిరిపోయే



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. సంగీర్తన కథానాయిక. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 12న ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం 'నువ్వే నాకు లోకం... నిదుర కుదురు చెదిరిపోయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. దూరమైన భార్యను గుర్తు చేసుకుంటూ భర్త మనసు పడే బాధను వర్ణిస్తూ సాగే ఈ గీతానికి కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చారు. కార్తిక్ హృద్యంగా ఆలపించారు.

అప్‌డేట్స్

దాండియా ఆడుతూ..



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో తన్వీ రామ్ పోషిస్తున్న రాధ పాత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దాండియా ఆడుతూ అందంగా కనిపిస్తూ తన్వీ రామ్ అందరినీ ఆకట్టుకుంటోంది. 'క'లో ఆమెది కీలకమైన పాత్ర. జంట దర్శకులు సుజీత్, సందీప్ దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చింతా గోపాలకృష్ణారెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో త్వరలో ఈ సినిమా విడుదల కానుంది.

ప్రకృతిని కాపాడే బందీ



ఆదిత్య ఓం నటించిన 'బందీ' చిత్రం త్వరలో విడుదల కానుంది. తిరుమల రఘు స్వీయ దర్శకత్వంలో వెంకటేశ్వరరావుతో కలసి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన అనంతరం రఘు మాట్లాడుతూ 'ఒకే ఒక్క పాత్రతో రూపుదిద్దుకున్న చిత్రమిది. ప్రకృతిని నాశనం చేసే కార్పొరేట్ కంపెనీలకు లీగల్ అడ్వైజర్‌గా ఉండే పాత్రను ఆదిత్య ఓం పోషించారు. అటువంటి వ్యక్తిని అడవుల్లో వదిలేస్తే ఏలా ఉంటుందనే ఆసక్తికరమైన కథనంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. మా హీరో ఇప్పుడు 'బిగ్‌బాస్'లో ఉన్నారు. ఆయన సక్సెస్ అయి వస్తాడని ఆశిస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. అమెరికాలో ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వీఎఫ్ఎక్స్ హెడ్ జాకబ్ చెప్పారు.

ఆర్టీసీ నిర్ణయం.. మునిసిపాలిటీకి శాపం

- దుకాణాలు ఖాళీ కావడంతో ఆదాయానికి గండి
- ఒకప్పుడు కళలాడే ప్రాంతం వెలవెలబోతున్న వైనం
- ఇదీ రాజాంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పరిస్థితి

రాజాం రూరల్: రాజాంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్వహణ నీరుగారుతోంది. ఆ సంస్థ తీసుకున్న నిర్ణయం మునిసిపాలిటీకి శాపంగా మారింది. ఆ సంస్థ అడ్డంగా గోడ నిర్మించడం వల్ల మునిసిపాలిటీ ఆదాయానికి గండిపడుతోంది. ఒకప్పుడు వందలాది మంది ప్రయాణీకులు, విద్యార్థులతో కళకళలాడేది. లక్షలాది రూపాయల వ్యాపార లావాదేవీలు జరిగేవి. మునిసిపాలిటీకి వేలాది రూపాయలు ఆదాయాన్ని సమకూరేది. ఇక్కడ వ్యాపారాలు చేసే వారు దుకాణాలు ఖాళీచేశారు. ఆ సంస్థ నిర్ణయం పుణ్యమాని ప్రస్తుతం కాంప్లెక్స్ కళావిహీనంగా మారింది. పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ఇక్కడ ఒకప్పుడు 100కు పైగా కుటుంబాలు జీవించేవి. ప్రస్తుతం వారంతా రోడ్డున పడ్డారు.

ఇదీ పరిస్థితి..

రాజాం మేజర్ పంచాయతీగా ఉన్న సమయం నుంచి బస్టాండ్ నిర్వహించేవారు. కాలక్రమంలో మునిసిపాలిటీ పరిధిలోని వచ్చింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజాం మునిసిపాలిటీ ఆర్టీసీకి కేటాయించిన రెండెకరాల స్థలంలో గత ఏడాది ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించిన విషయం విదితమే. దీంతో కాంప్లెక్స్‌లో ప్రైవేటు వాహనాలు, వ్యాపారుల తాకిడిని నియంత్రించే చర్యల్లో భాగంగా ఆ సంస్థ తన పరిధిలో అడ్డంగా గోడను నిర్మించింది. ఫలితంగా పాత బస్టాండ్ ప్రాంతంలో రద్దీ తగ్గింది.దీంతో మునిసిపాలిటీ పరిధిలో ఉన్న రెండు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో గల ఉన్న షాపులకు వ్యాపారం తగ్గుముఖం పట్టింది. వ్యాపారాలు లేకపో వడంతో అద్దెలు చెల్లించలేక, నిర్వహించలేక నిర్వాహకులు వాటిని ఖాళీ చేశారు. దీంతో మునిసిపాలిటీ ఏడాదికి సుమారు రూ.10 లక్షల వరకూ ఆదాయానికి గండిపడింది. దశాబ్దాలుగా బస్టాండ్‌లో నమ్ముకుని చిరు వ్యాపారులు చేస్తున్న కుటుంబాలు బతుకుతెరువు కోల్పోయాయి.



దుర్గంధభరితంగా మారిన ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు

దుర్గంధ పూరితంగా పాతబస్టాండ్

పాత బస్టాండ్ ప్రాంతం దుర్గంధపూరితంగా తయారవుతోంది. ఇక్కడే పెద్దసంఖ్యలో కూరగాయలు, ఆకుకూరల వ్యాపారులు నిత్యం ఉదయం విక్రయిస్తున్నారు. వారంతా వ్యర్థాలు ఇక్కడే పోగుచేస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ గోడకు ఆనుకుని ఆటోలు, మినీ వ్యాన్లతోపాటు ఇతర వాహ నాలు పార్కింగ్ చేస్తున్నారు.కొంతమంది బస్టాండ్‌ప్రాంతంలో బడ్డీలు ఏర్పాటుచేశారు. టీడీపీ హయాంలో ఇదే ప్రాంతంలో రూ. కోటి వెచ్చించి ఏర్పాటుచేసిన రైతుబజార్ వెలవెలపోతోంది. ఆ ప్రాంతం దుర్గంధపూరితంగా మారడంతో కొనుగోలుదారులు రైతుబజారు వైపు కన్నెత్తి చూడడంలేదు. రైతుబజార్‌లో షాపులు అద్దెకు తీసుకున్న చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. కాగా పాత బస్టాండ్ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కమిషనర్ రామ అప్పలనాయుడికి సూచించినా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలొ స్తున్నాయి. ఇటీవల అన్న కాంటీన్ పనుల ప్రగతిని పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే పాత బస్టాండ్‌ను పరిశీలించి మరమ్మతుచేయాలని కమిషనర్‌కు సూచించిన విషయం విదితమే.

కారు ఢీకొని మహిళ మృతి

- కుమారునికి గాయాలు ● నిమ్మలపాలెం సమీపంలో ప్రమాదం

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం సమీపంలోని మలుపువద్ద గల ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ద్విచక్రవాహన్ని కారు ఢీకొన్న సంఘటనలో తల్లి మృతిచెందగా కుమారుడిగా గాయాలయ్యాయని సీఐ షణ్ముఖరావు తెలిపారు. సీఐ కథనం మేరకు.. విశాఖపట్నంలోని దొండపర్తికి చెందిన మల్లంకి అచ్చమ్మ(50) తన కుమారుడు చంద్రశేఖర్‌తో ద్విచక్రవాహనంపై శృంగవరపుకోట నుంచి కొత్తవలస వైపు బుధవారం రాత్రి వెళ్తున్నారు. ఆ సమయంలో కొత్తవలస నుంచి శృంగవరపుకోట వెళ్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చొన్న అచ్చమ్మతోపాటు ద్విచక్రవాహనం నడుపుతున్న చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు.వీరికి వారి బంధువులు కొత్తవలసలో ప్రథమ చికిత్సచేయించి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అచ్చమ్మ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అచ్చమ్మ అల్లుడు మల్లువలస సాంబశివరావు ఫిర్యాదుమేరకు కేసునమోదుచేశారు. అనంతరం పోస్టుమార్టానికి మృతదేహాన్ని తరలించారు.

అదృశ్యమైన ఫార్మా ఉద్యోగి మృతి



సూర్యనారాయణ (ఫైల్)

పరవాడ: ఫార్మాసిటీలోని అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం అదృశ్యమైన ఆర్.సూర్యనారాయణ(40) పరిశ్రమ ఆవరణలోని మిథనాల్ ట్యాంక్‌లో శవమై తేలాడు. ఈవిషయాన్ని గురువారం ఉదయం యాజమాన్యం గుర్తించింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని వీలుపర్తికి చెందిన ఆర్.సూర్యనారాయణ మంగళవారం జనరల్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యాడు. సాయంత్రం ఐదు గంటలకు విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాల్సిఉంది. కానీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బుధవారం ఉదయం పరిశ్రమ వద్దకు వచ్చి వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబీకులు పరవాడ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పరిశ్రమలోని ఉద్యోగులంతా గురువారం ఉదయం మరోసారి సూర్యనారాయణ కోసం అన్ని విభాగాల్లో గాలింపు చర్యలుచేపట్టారు. ఈ క్రమంలో మిథనాల్ ట్యాంకు పైకి ఎక్కి చూడగా అందులో సూర్యనారాయణ మృతదేహం కనిపించింది. అగ్నిమాపక సిబ్బంది మిథనాల్ ట్యాంకులోకి నీరు నింపి, సూర్యనారాయణ మృతదేహాన్ని పైకి తేలేలా చేసి బయటకుతీశారు.కాగా యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే సూర్యనారాయణ ప్రాణాలు కోల్పోయాడని, అందువల్ల బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబీకులు, బంధువులు పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు గురువారం దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు పోలీసులు సిద్ధమవుతుండగా బంధువులు అడ్డుకున్నారు. కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తామని లిఖితపూర్వకంగా హామీఇవ్వాలని పట్టుబట్టారు.వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో మృతుడి కుటుంబ సభ్యులు, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగాయి. రూ.50 లక్షలు నష్టపరిహారంతో పాటు దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం మరో లక్ష రూపాయలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. అనంతరం సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాగా సూర్యనారాయణకు భార్య బాల పరమేశ్వరి, కుమార్తె జ్యోషిత, కుమారుడు సృజన్ ఉన్నారు. ఉద్యోగం నిమిత్తం కుటుంబంతో కలిసి గాజువాకలో నివాసముంటున్నాడు.

వసంతగెడ్డలో మృతదేహం లభ్యం

గంట్యాడ:మండలంలోని చంద్రంపేట-వసంత గ్రామాల మధ్య వసంతగెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎల్.కోట మండలంలోని చందులూరుకి చెందిన బత్తులుసతీష్(38)తన భార్య వరలక్ష్మితోకలిసి ద్విచక్రవాహనంపై బుధవారం మధ్యాహ్నం తన అత్తవారి గ్రామం చంద్రంపేట వచ్చి తిరిగి చందులూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ సమయంలో చంద్రంపేట-వసంత మధ్య ఉన్న గెడ్డ వద్ద అదుపు తప్పి వాహనం పడిపోయిన సంగతి విదితమే. దీంతో సతీష్ ఆచూకీకోసం గాలించినా లభించలేదు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు మరో సారి గురువారం ఉదయం గాలించగా సతీష్ మృతదేహం గెడ్డలో లభ్యమైంది. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎస్.కోటఆసుపత్రికి తరలించారు. సతీష్ మృతికి టీడీపీ నాయకులు కొండపల్లి కొండలరావు, పార్టీ మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, నాయకులు బూడి అప్పలనాయుడు, రంది చినరామునాయుడు, జి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొరపోలు హర్షవర్ధన్ గురువారం సాయంత్రం హాస్టల్ గది (డార్మెటరీ)లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సాయంత్రం ఆరుగంటల సమయంలో తోటి విద్యార్థులంతా స్నాక్స్ తీసుకొని మైదానంలో ఆడుకుంటున్న సమయంలో హర్షవర్ధన్ డార్మెటరీలో ఫ్యాన్‌కు తాడు కట్టి ఉరిపోసుకునేందుకు ఉపక్రమించాడు. ఓ విద్యార్థి చూసి కేకలు వేయడంతో అందరూ వచ్చి హర్షవర్ధన్‌ను కిందికి దించి బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ లేదా విజయనగరం తరలించాలని ప్రభుత్వ వైద్యులు సూచించారు. అంతదూరం తీసుకెళ్లడం రిస్కుగా భావించి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బొబ్బిలి ఆర్డీవో ఎసాయిశ్రీ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కటకం సతీష్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. హర్షవర్ధన్ స్వగ్రామం గంట్యాడ మండలం బురదపాడు. వినాయక చవితి పండగ కోసం ఇంటికి వెళ్లి బుధవారం తిరిగి గురుకులానికి చేరుకున్నాడు. గురువారం మధ్యాహ్నం భోజనం చేశాడని, విద్యా ర్థులతో సరదాగానే గడిపాడని తోటి విద్యార్థులు అంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

ఇద్దరు యువకులు...

బాడంగి:ఇద్దరుకు యువకులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాడంగి సీహెచ్‌సీ వైద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. వీరి ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ చెప్పారు. గజరాయనివలసకు చెందిన మార్పిన మనోజ్‌కుమార్ పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకోవడంతో సీహెచ్‌సీకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోగల పాలవలసకు చెందిన గేదెల అజయ్ (18) కూడా పురుగుల మందుతాగి తాగడంతో పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు 108లో తరలించినట్లు తెలిపారు.

పది కేజీల గంజాయి స్వాధీనం

బాడంగి:బాడంగిలోని ఎత్తుఖానా వద్ద ఎస్ఐ తారకేశ్వరరావు వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం బాడంగిలో విలేకరులతో మాట్లాడుతూ వాహనతనిఖీలో భాగంగా ఒడిశాలోని సిమిలిగూడ బ్లాక్ కొరాపుట్ జిల్లా జంగరాడ గ్రామానికి చెందిన టున హంటల్, బాలు హంటల్ పది కేజీల గంజాయితో పట్టుబడ్డారని చెప్పారు. ఈ మేరకు వార్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నారాయణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులపై అలసత్వం వద్దు: ఎస్పీ

విజయనగరం క్రైం:జిల్లాలో వివిద పోలీస్‌స్టేషన్లలో గంజాయి కేసుల్లో ప్రధాన సూత్రదారులను అరెస్టుచేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదై దర్యాప్తుల్లో ఉన్న కేసులను మిస్సింగ్, సైబర్ కేసులను జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షించి చేపట్టాల్సి చర్యలు గురించి దిశా నిర్ధేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాప్తు పూర్తయిన గంజాయి కేసుల్లో దాఖలుచేసిన కేసుల్లో సంబందిత న్యాయస్థానం నుంచి సీసీ నెంబర్లు పొందాలన్నారు. మిస్సింగ్‌కేసులపై అలసత్వం వద్దని తెలిపారు. కేసు నమోదైన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని చెప్పారు.కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు గోవిందరావు, వీరకుమార్, శ్రీనివాసరావుతో పాటు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన

బొబ్బిలి:బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్‌లోగల ఇసుకస్టాకు పాయింట్‌ను గురువారం గనుల శాఖ డిప్యూటీ డైరెక్టరు సూర్యచంద్రరావు, తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీనుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక సిబ్బందిని రప్పించి ప్రస్తుతం స్టాకుపాయింట్‌లో ఎంత ఇసుక లభ్యత ఉంటుందోనని పరిశీలిస్తామని తెలిపారు. కలెక్టరు నేతృత్వంలోని అధికారిక కమిటీ ఆదేశాల మేరకు వంగర తదితర ప్రాంతాల నుంచి మళ్లీ కొత్తగా ఇసుకను బొబ్బిలి స్టాకు పాయింట్‌కు తెప్పించేందుకు కసరత్తు జరుగుతోందని డీడీ తెలిపారు.

సువర్ణముఖిలో సిల్ట్ తొలగింపునకు చర్యలు

రూ.21 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు: జేసీ



సువర్ణముఖి నది పరీవాహక ప్రాంతంతో పరిశీలిస్తున్న సేతు మాధవ్

రాజాం (వంగర): సువర్ణముఖి నదిలో సిల్ట్ తొలగింపునకు చర్యలు తీసుకుంటామని జేసీ సేతుమాధవ్ తెలిపారు. గురువారం మండలంలోని కొండచాకరాపల్లికి ఆనించిఉన్న సువర్ణముఖినదిలో సిల్ట్ పేరుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మడ్డువలస జలాశయం ఎగువ ప్రాంతంలో సువర్ణముఖినదిని ఆనించి ఉన్న కొండచాకారపల్లి, కొప్పర గ్రామాల రక్షణ కోసం నదిలో సిల్ట్ తొలగింపు చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సువర్ణముఖిలో వరద పెరుగుతున్న సమయంలో కొండచాకరాపల్లి, కొప్పర గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. పంటలకు కూడా తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. రెండు గ్రామాలు రక్షణ నిమిత్తం నదికి ఆనుకొని ఉన్న ఇసుకను వేరుచేసి ఐటీడీఏ కాలనీకి ఆనుకొని ఉన్న కాలనీకి స్టాక్ పాయింట్‌ను తరలిస్తామన్నారు. అక్కడ నుంచి బొబ్బిలిలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు తరలించి జిల్లాలో ప్రజలు అవసరాల కోసం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ఇప్పటికే రక్షణ గోడ నిర్మాణానికి 21 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శాంతి పాల్గొన్నారు.

70 శాతం కంప్యూటరైజేషన్ పూర్తి

- డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు

రామభద్రపురం:ఖరీఫ్‌సీజన్‌లో జిల్లాలోని సుమారు రూ.300కోట్ల వ్యవసాయ రుణాలు రైతులకు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు.గురువారం రామభద్రపురం డీసీసీబీ బ్రాంచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రూ.119కోట్ల ఇచ్చామని, పీఏసీఎస్‌లు కంప్యూటరైజేషన్ చేస్తుండడంతో కొంతమేరకు మందగించిందని తెలిపారు. 70శాతం ప్యాక్ కంప్యూటరైజేషన్ చేసినట్లు చెప్పారు. డీసీసీబీ పరిధిలోఅన్నిరకాల రుణాలిస్తున్నామన్నారు. ఇంటినిర్మాణానికి రూ.40 లక్షలు,మరమ్మతులకు లక్ష రూపాయల వరకు రుణాలిస్తామని తెలిపారు. ఇప్పటివరకు టిడ్కో ఇళ్లకు రూ.18.63 కోట్లు, హౌసింగ్‌కు రూ.4.68కోట్లు ఇచ్చామన్నారు. డీసీసీబీ ద్వారా సుమారు రూ.2165 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. రూ.300 కోట్లు డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. రూ.200 కోట్లు వరకు బంగారం రుణాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాల కింద రూ.16 కోట్లు ఇచ్చామని చెప్పారు.ప్యాక్ కంపుటరైజేషన్ అయినంతవరకు పీఐసీలు ఉంటాయని, ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ మేనేజర్ జి.చంద్రమోహన్‌నాయుడు, శ్రీలత పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు



బేబీనాయనకు విరాళం అందజేస్తున్న నాని దంపతులు

బొబ్బిలి: విజయవాడ వరద బాధితులకు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి పలువురు విరాళాలను బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయనకు గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన అభ్యుదయ విద్యాసంస్థల అధినేతలు మర్రాపు కూర్మినాయుడు (నాని), శారద దంపతులు రూ.1,11,111 విరాళాన్ని అందజేశారు. అలాగే వ్యాపారవేత్త పూసర్ల లక్ష్మీనారాయణ రూ.50 వేలు, సీహెచ్‌సీ వైద్యాధికారి గేదెల శశి భూషణరావు రూ.25 వేలు, బాడంగి రిటైర్డ్ ఎంఈవో, తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవిరావు రూ.25 వేలు, డొంకినవలస (ఆర్ఎస్) ఉప్పల హరి రూ.25 వేలు, దిబ్బగుడ్డివలసకు చెందిన రెడ్డి భూషణరావు, మరడ నారాయణరావులు చెరో పదివేల రూపాయల చొప్పున బేబీనాయనకు అందజేశారు. ● బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ రూ. 15వేలు, చింతాడ సీబీఎం ఫ్యామిలీస్ రూ. 13,056, కారాడకు చెందిన మమ్ముల సతీష్ గుప్తా మిత్రబృందం రూ.21 వేలు, విజయనగరం పార్లమెంట్ తెలుగుదేశం నాయీబ్రాహ్మణ సంఘం నేతలు చిలకలపల్లి నారాయణరావు, బర్లి అప్పారావులు రూ.5వేలు చొప్పున విరాళాలను సీఎం సహాయనిధికి పంపించారు. పట్టణానికి చెందిన తెంటు రమేష్ రూ. 10 వేలు, చీమల రాంబాబు, యెన్నా బాబులు రూ. పదివేలు విరాళం అందజేశారు.

బాలలు విరాళాల సేకరణ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని బాలలు విజయవాడ బాధితులకు విరాళాలు సేకరించారు. ఈ మేరకు రూ.5,312 ఎమ్మెల్యే అదితికి గురువారం క్యాంప్ కార్యాలయంలో అందచేశారు. వరద బాధితుల కోసం కిడ్డీ బ్యాంకులోని డబ్బులతో పాటు స్కూల్ ముగిసిన తర్వాత ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు.

●**విజయనగరం రూరల్** :విజయవాడ వరద బాధితులకు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి గురువారం ఒక ప్రకటనలో కోరారు.విరాళాలు ఇవ్వదలిచిన వారు నగరంలోని అశోక్ బంగ్లాలోని తన కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.దాతలు ఇచ్చిన విరాళాలను నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేస్తామని తెలిపారు.



ఎమ్మెల్యే అదితికి సేకరించిన విరాళాలు అందజేస్తున్న బాలలు

క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక

రేగిడి: సంకిలి ఉన్నతపాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న క్రీడాపోటీలకు గురువారం మండలస్థాయిలో విద్యార్థులను ఎంపికచేశారు. హెచ్‌ఎం ఎం.రామినాయడు, పీఈటీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికలకు సంబంధించి ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్ క్రీడాపోటీలు నిర్వహించారు. మండలంలో పది ఉన్నతపాఠశాలల నుంచి 250 మంది హాజరుకాగా 114 మందిని ఎంపికచేసినట్లు సత్యనారాయణ తెలిపారు. ఈపోటీలకు పీఈటీలు, పీడీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

స్కూల్ గేమ్స్ నిర్వహణకు సమావేశం

శృంగవరపుకోట: శృంగవరపుకోట మానవవనరుల కార్యాలయంలో గురువారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహణపై విద్యాశాఖాధికారి పాదం గణపతి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు పోట్నూరు శ్రీరాములు, లక్ష్మణరావు తదితర 17మంది ఉపాధ్యాయులు స్కూల్ గేమ్స్ నిర్వహణపై చర్చించారు.

భూఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

- తారాపురం గ్రామస్థుల డిమాండ్

రామభద్రపురం: మండలంలోని తారాపురంలో చింతాలమ్మ తల్లి ఆలయ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం గ్రామస్థులు డిమాండ్ చేశారు.తహసీల్దార్ ఆకుల సులోచనారాణి సంఘటనా స్థలానికి వెళ్లి గ్రామస్థులతో మాట్లాడారు. కొందరు తప్పుడు పత్రాలతో సృష్టించిన వన్‌బీని తక్షణమే రద్దుచేయాలని గ్రామస్థులు కోరారు. సుమారు 58 సెంట్ల భూమిని ఏళ్ల కిందట చింతాలమ్మతల్లికి కొంతమంది దానం ఇచ్చారని వివరించారు. అయితే ఆ భూమి ఆక్రమణ ప్రయత్నాలను తిప్పికొట్టాలని బెవర చిన్నారావు, పిల్లా శ్రీనివా సరావు, పొట్నంగి తమ్మినాయుడు, బెవర చినమ్మతల్లి, దుంప భాస్కరరావు కోరారు. ఈ భూమి అన్యాక్రాంతమైతే గ్రామస్థులంతా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు.

పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలి

వేపాడ: పోలవరం ఎడమ కాలువ సర్వేను అడ్డుకుంటామని పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్,యేడువాక రామకృష్ణ తెలిపారు.గురువారం మండలంలోని దబ్బిరాజుపేట సమీపంలో కాలువ సర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువ డిజైన్ మార్చాలని కోరారు. రైతుల అనుమతి లేకుండా కాలువ నిర్మాణానికి సర్వే చేస్తామంటే ఊరుకునేది లేదని తెలిపారు. కాలువ సర్వే పనులు అడ్డుకోవాలని ఎనిమిది మండలాల్లో ఉన్న 58గ్రామకమిటీల నిర్వాసితులకు పిలుపునిచ్చారు. ప్రాణాలైన అర్పిస్తామని కాలువ సర్వే పనులు జరగనిచ్చేదిలేదని తెలిపారు.గ్రామస్థులంతా సర్వేకు వచ్చిన అధికారులను వెనక్కి పంపించారు. కార్యక్రమంలో యేడువాక అప్పలనాయుడు, శానాపతి గణేష్ పాల్గొన్నారు.



సర్వే పనులను అడ్డుకుంటున్నరైతులు, పోరాట కమిటీ సభ్యులు

బొబ్బిలిలో వినాయక నిమజ్జనాలు

బొబ్బిలి:బొబ్బిలిలో వినాయకవిగ్రహాల నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పలుచోట్ల వినాయకులను వైభవంగా నిమజ్జనం కోసం ఊరేగింపు నిర్వహిస్తున్నారు. మహిళల కోలాట ప్రదర్శన, యూత్ డ్యాన్సులు ఆకట్టుకుంటున్నాయి.చీపురుపల్లి వీధిలో టీడీపీ నేత పువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

వస్త్రపురికాలనీలో ముగ్గుల పోటీలు

రాజాం:మునిసిపాలిటీలోని వస్త్రపురికాలనీలోగురువారంరాత్రి గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు నిమజ్జనం అనంతరం బహుమతులు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.శుక్రవారం దీపారాదన నిర్వహిం చనున్నట్లు చెప్పారు.

జీవో-115ను రద్దుచేయాలి



ధర్నా చేస్తున్న ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి జీఎన్ఎంలు

శృంగవరపుకోట: జీవో-115ను రద్దుచేయాలని స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. గురువారం శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో జీఎన్ఎం (స్టాఫ్‌నర్సులు)ధర్నాచేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడున్నరేళ్ల జీఎన్ఎం, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తిచేసి కొంతకాలంగా ప్రభుత్వాసుపత్రిలో సేవలందిస్తున్న వారినికాదని ఇటీవల శిక్షణ పొందిన ఏఎన్ఎంలను స్టాఫ్‌నర్సులుగా నియమించేందుకు జీవో ఇవ్వడం అన్యాయమన్నారు.

సీబీఎం పాఠశాలపై విచారణ చేయాలి

బొబ్బిలి:బొబ్బిలిలోని సీబీఎం పాఠశాల వ్యవహారంపై సమగ్రంగా విచారణ నిర్వహించాలని సీపీఎం జిల్లా నాయకుడు పి.శంకరరావు కోరారు.గురువారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ సీబీఎం స్కూల్ బిల్డింగ్, స్థలం ట్రస్ట్ పేరు మీద ఉన్నప్పుడు భూబదలాయింపు చేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఎయిడెడ్ పాఠశాలను కొనుగోలు, అమ్మడం నేరమని కమిటీ వేసి నిజ నిర్ధారణ చేసి, సదరు రిజిస్ట్రేషన్లను రద్దుచేసి పాఠశాలను పునరుద్ధరించాలని కోరారు.కార్యక్రమంలో మునకాల శ్రీనివాసరావు, వేమిరెడ్డి లక్ష్మునాయుడు, బొత్స గోపాలం పాల్గొన్నారు.

17న నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

వేపాడ: మండలంలో 17న జరగనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ విజయవంతం చేయాలని అధికారులు కోరారు.ఈ మేరకు గురువారం వీలుపర్తిలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఎంపీడీవో పట్నాయక్, సర్పంచ్ శానాపతి లీల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో జగదీశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేపాడ : వేపాడ ఉప కేంద్రం పరిధి 11 కేవీ బల్లంకి ఫీడర్‌లో శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నట్లు విద్యుత్ ఏఈ సూరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీలకంఠరాజపురం,పెదగుడిపాల, భర్తవానిపాలెం, బక్కునాయుడుపేట, రాయుడుపేట, చినగుడిపాల, సంజీవమెట్ట, నల్లబిల్లి, సంజయపురం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

●**రింగురోడ్డు** : విజయనగరంలోని ఉడా సబ్‌స్టేషన్ ఫీడర్‌లో నిర్వహణ పనుల వల్ల శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.హరి గురువారం ఒకప్రకటనలో తెలిపారు.దీంతో బొగ్గుల దిబ్బ, పోలయ్యపేట, ఎల్‌బీ కాలనీ, మారుతీనగర్, కంటోన్మెంట్ ఏరియా, ఉడా-1, 2, 3, 4 బొబ్బాది పేట, సాయిబాబ టెంపుల్ ,ఫేజ్-2 తదితర ప్రాంతాల్లోసరఫరాకు అంతరాయంకలుగుతుందని పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

లక్కవరపుకోట: ఎల్‌కోట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లుఎంపీడీవో కె.రూపేష్ తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

15లోగా ఈ-క్రాప్ చేసుకోండి

లక్కవరపుకోట: రైతు సేవాకేంద్రాల్లో ఈనెల 15లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో ఎం.స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ-క్రాప్ చేయని రైతులకు రాయితీలు అందవని పేర్కొన్నారు. అదే విధంగా ధాన్యం కొనుగోలులో అవాంతరాలు ఏర్పడతాయని తెలిపారు.

కొళాయి కనెక్షన్లకు దరఖాస్తులు

రింగురోడ్డు: కొళాయి కనెక్షన్ అవసరమైనవారు దరఖాస్తులను సచివాలయంలో అందచేసి రశీదులను పొందాలని విజయనగరంనగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతోపాటు ఆస్తిపన్ను కాపీ ఆధార్‌కార్డు నకళ్లను జతచేయాలని కోరారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి

బొబ్బిలి రూరల్:పారాదికి చెందిన బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లాడ కృష్ణ మృతి చెందారు. గురువారం భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి పూలమాల వేసి నివాళులర్పించారు.

దిబ్బగుడ్డివలసలో బీసీజీ టీకాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలసలో గురువారం క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంలో భాగంగా బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వృద్ధులకు బీసీజీ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెన్నెల నాగరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేలకొరిగిన బొప్పాయి పంట



నేలకూలిన బొప్పాయి పంట వద్ద రైతు పెంట తాత

జామి: జామి దొండపర్తి సమీపంలోని పెంటవాని కళ్లాల్లో రైతు పెంట తాత వేసిన బొప్పాయి పంట ఇటీవల కురిసిన వర్షాలు, గాలులకు నేలకొరిగింది. చేతికి వస్తున్న సమయంలో నాశనం కావడంతో పంటనష్టం అంచనా వేసిపరిహారం ఇప్పించాలని కోరాడు.అప్పుచేసి సాగు చేశానని, పంటపోవడంతో అప్పులే మిగిలాయని వాపోయాడు.

ఎయిడ్స్‌పై అవగాహన

బొబ్బిలి:బొబ్బిలి ప్రభుత్వసామాజిక ఆరోగ్య కేంద్రంలో గురు వారం యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఆయోధ్య హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో ర్యాలీచేశారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ కె.ఉమ, ఏఎన్ఎమ్ పి.లక్ష్మి పాల్గొన్నారు.

బొబ్బిలిలో 'వార్డు సందర్శన'

బొబ్బిలి: బొబ్బిలి మునిసిపాలిటీలో కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబజారు రోడ్డులో సీసీ రోడ్డు, మీగడవీధి, సిరిగుడువీధిలో సీసీ కాలువలు, బండారువీధిలో తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయించాలని, బోరుబావులకు ప్లాట్‌ఫారాలు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు వేయించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెలగాడ హైమావతి పాల్గొన్నారు.

కషాయాలతో అధిక దిగుబడి

బొబ్బిలి రూరల్: కషాయాలు వరిపైరులో పిచికారీ చేస్తే పురుగులు, దోమలు నివారించడంతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు తెలిపారు.గురువారం మండలంలోని జగన్నాథపురంలో రైతులకు జీవామృతం, దశపరిణి కషాయాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్నంనాయుడు, శ్రీరామునాయుడు పాల్గొన్నారు.

రంగరాయపురంలో 'స్వచ్ఛ పక్వడ్'

బొబ్బిలిరూరల్:రంగరాయపురం ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం స్వచ్ఛపక్వడ్ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం పి.నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు హ్యాండ్‌వాష్‌డే కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు.

17 నుంచి 'స్వభావ స్వచ్ఛత'

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: స్వచ్ఛభారత్ దివస్(అక్టోబరు 2)ను పురస్కరించుకుని సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఈ కార్యక్రమం నిర్వహణపై మార్గదర్శకాలు తెలియజేశారు. జిల్లాలో సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ దివస్ ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి షెడ్యూల్ రూపొందించాలని జిల్లా పంచా యతీ అధికారులు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సాలూరు: సాలూరు పట్టణ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు సీఐ ఎం.వెంకటరమణ, ఎస్ఐ సంధ్యారాణి సిబ్బంది గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎక్సైజ్‌ను ఎస్ఈబీగా మారుస్తూ ఇచ్చిన జీవోలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం ఆనందదాయకం అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను తక్షణమే తరలించాలి


నగర పంచాయతీ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న దృశ్యం

పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న చెత్తను తక్షణమే తరలించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో ఆందోళన చేశాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.ఇందిర మాట్లాడుతూ.. పాలకొండ పట్టణంలో సేకరించిన చెత్తను నగర పంచాయతీ కార్యాలయం ఎదుట వేయడం తగదన్నారు. ఎస్ఐ ప్రయోగమూర్తి తన సిబ్బందితో నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అంతవరకు అక్కడ చెత్త వేయకుండా చూస్తామని హామీనివ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సీహెచ్ సంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య భవన నిర్మాణం పూర్తి చేయండి

భామిని: భామినిలో ఏకలవ్య భవన నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి కాంట్రాక్టు ప్రతినిధులను కోరారు. గురువారం భామిని వచ్చిన ఆమె ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే భామిని ఆదర్శ పాఠశాలను సందర్శించి, జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పాఠశాల ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్, గణిత ఉపాధ్యాయుడు సవర జానకిరావుకు సన్మానం చేశారు.

సాగునీరు అందజేయాలి

పాలకొండ: తోటపల్లి కాలువ చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని ఏపీ రైతు సంఘం నేతలు.. సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి తెలిపారు. గురువారం వారు సబ్ కలెక్టర్‌ను కలిసి, రైతుల సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి, మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు బుడితి అప్పలనాయుడు, వావిలపల్లి రమణమూర్తి, కిమిడి రామ్మూర్తినాయుడు, పిట్ట రమణ, వండాన కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తులు వితరణ

పాలకొండ: విజయవాడ వరద బాధితులకు పాలకొండ పట్టణానికి చెందిన జీఆర్ క్లాత్ అండ్ రెడీమేడ్ షాపు యజమాని గోవిందరావు దుస్తులు వితరణ చేశారు. వీటిని సీపీఐ పాలకొండ నియోజకవర్గం కార్యదర్శి బుడితి అప్పలనాయుడుకు గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల వేదిక అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడు, వావిలపల్లి రమణమూర్తి, రైతు సంఘం నాయకులు పిట్ట రమణ, వండాన కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి పాఠశాలల సమస్యలు


లోకేశ్‌తో విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర గురువారం మంగళగిరిలో కలిశారు. జిల్లాలోని పాఠశాలల పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సవరభాషా ప్రాంతాల్లో తెలుగు కూడా బోధించేందుకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని కోరారు. గెస్ట్ లెక్చరర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారు. వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యేను మంత్రి అభినందించారు.

గర్భిణులకు అసౌకర్యం కలగకుండా చూడండి

సీతంపేట రూరల్: వైటీసీ కేంద్రంలో ఏర్పాటుచేసిన వసతిగృహంలో ఉన్న గర్భిణులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. గురువారం గర్భిణుల వసతి గృహాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతిరోజూ గర్భిణులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. తరుచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. దీనికి ముందు తురాయిపువలస హెచ్‌టీసీ ఫాంను పరిశీలించారు. అక్కడ మొక్కలకు అంట్లు కడుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫాం వెలుపల భాగంలో మొక్కలు ప్రదర్శిస్తూ ఓ షాప్ ఏర్పాటు చేస్తే బావుంటుందని పీహెచ్‌వో వెంకటగణేష్‌కు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ ఫీడర్ సప్లయి పరిధిలోగల ఆర్టీసీ కాంప్లెక్స్, గూడ్స్‌షెడ్ రోడ్, విశ్వ విజ్ఞాన విద్యాలయం, పోస్టాఫీసు వీధి, జిల్లా ఆసుపత్రి రోడ్డు, జీజీ కళాశాల, మైదానం వీధి, గెడ్డవీధి, నాయుడువీధి, బురాడ వీధి, నారాయణ పాఠశాల ప్రాంతం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తామని చెప్పారు. ● **మక్కువ:** మక్కువ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు పార్వతీపురం ఈఈ కె.గోపాలరావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కవిరిపల్లి, ఎస్‌ఆర్‌పురం, తోటవలస, చెముడు, అంటివలస గ్రామాలకు విద్యుత్తు నిలిపేస్తున్నట్టు చెప్పారు. ● **వీరఘట్టం:** నవగాం ఉప కేంద్రం ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, ఇతర పనుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ బాలాజీ తెలిపారు. తలవరం, పనసనందివాడ, కుమ్మరిగుంట, ఎం.వెంకటాపురం, బిటివాడ, వండువ, అడారు, బొడ్లపాడు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

జియ్యమ్మవలస: అలమండ పంచాయతీ రావాడ రామభద్రపురంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14, అండర్-17 బాల బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఎంఈవో-2 ముదిలి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ ఎంపికలు జరిగాయి. ● **భామిని:** భామిని ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు రెండో రోజు గురువారం నిర్వహించారు. ● **వీరఘట్టం:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం మండల స్థాయి పాఠశాల ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 300 మంది బాల బాలికలు పాల్గొన్నారు.


కురుపాంలో ధర్నా నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు


బెలగాం: ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు



సాలూరు: ఏరియా ఆసుపత్రి వద్ద..

జీవో నెం.115ను రద్దు చేయాలి

● జిల్లా వ్యాప్తంగా స్టాఫ్‌నర్సుల డిమాండ్

● రెండో రోజూ కొనసాగిన నిరసన

తమకు నష్టం కలిగించే జీవో నెంబర్ 115ను రద్దు చేయాలని స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల వద్ద రెండో రోజు గురువారం వారు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెం.115ను రద్దు చేసి, నోటిఫికేషన్ ద్వారా స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తమని కాదని, సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్‌నర్సులుగా పదోన్నతి కల్పించాలనుకోవడం అన్యాయం అన్నారు. మూడున్నరేళ్ల జీఎన్ఎం కోర్సు, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కష్టపడి చదివి స్టాఫ్‌నర్సులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులతో పాటు సీపీఐ నాయకులు పాల్గొన్నారు. గుమ్మలక్ష్మీపురంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ విలేకర్లతో మాట్లాడుతూ జీవో 115ను రద్దు చేసి రెగ్యులర్ స్టాఫ్‌నర్సు పోస్టుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. (ఆంధ్రజ్యోతి బృందం)


గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జీవన్

పెట్టుబడి సాయం అందించండి

● రైతు సంఘ నాయకుల డిమాండ్

● సచివాలయ అధికారులకు వినతిపత్రాల అందజేత


పాలకొండ: సచివాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతులు


సాలూరు రూరల్: పెదపథం సచివాలయంలో..


సీతానగరం (బలిజిపేట): వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద తక్షణమే రూ.20వేలు అందించాలని ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు బంటుదాసు డిమాండ్ చేశారు. రైతులతో కలిసి మండలంలోని వెలగవాడ, సింగన్నవలస సచివాలయాల్లో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువు, తుఫాన్లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం ఇవ్వాలన్నారు. రెండు లక్షల వరకు రైతు రుణాలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దని కోరారు. తోటపల్లి శివారు గ్రామాలకు నీరు రావడం లేదన్నారు. రైతు సంఘం కమిటీ సభ్యుడు కాయల జయరాం, రైతు సంఘం ప్రతినిధులు, సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం వెంటనే అందించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పెదపథం గ్రామ సచివాలయ అధికారులకు గురువారం వినతిపత్రం అందించారు. వెంగళరాయసాగర్‌పై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని కోరారు. ● **సీతానగరం (బలిజిపేట):** ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇవ్వాలని, అలాగే రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో నారాయణపురం, పెద్దింపేట, పలగర, బలిజిపేట, చెల్లింపేట, వంతరం, మిర్తివలస, పెదపెంకి సచివాలయాల్లో గురువారం వినతిపత్రాలు అందజేశారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో పని


భోజనాలు వడ్డిస్తున్న విద్యార్థినులు

కొమరాడ / జియ్యమ్మవలస: కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల తీరుపై విద్యార్థినుల తల్లిదండ్రులు నేరుగా జేసీ శోభితను గురువారం ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులకు టీలు అందించడం తో పాటు భోజనాలు వడ్డించడం, పాఠశాల తెరవడం, తాళాలు వేయడం చేయిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై వసతి గృహ సంక్షేమాధికారిణి రాజేశ్వరికి వివరణ కోరగా వర్కర్లు లేనందువల్ల తప్పడం లేదని బదులిచ్చారు.

ఆడలి వ్యూపాయింట్‌ను మరింత అభివృద్ధి చేస్తాం

● ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్: సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలోని ఆడలి వ్యూపాయింట్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆడలి వ్యూపాయింట్‌లో చేపడుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యాటక ప్రాంతాన్ని ఎక్కువమంది పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పరిశీలనలో పీవోతో పాటు టీడబ్ల్యూ ఈఈ కృష్ణకుమార్, పీహెచ్‌వో వెంకటగణేష్, ఏఈ నాగభూషణం ఉన్నారు.

మళ్లీ ట్రాఫిక్‌జాం

● రహదారిలో దిగబడిన వాహనాలు

● నిలిచిన 108 వాహనం


రోడ్డుపై దిగబడిన లారీ

జియ్యమ్మవలస / కొమరాడ: కొమరాడ మండలం గుమడ గ్రామం వద్ద అంతర్ రాష్ట్ర రహదారిపై మళ్లీ ట్రాఫిక్‌జాం అయ్యింది. గురువారం ఉదయం 10 గంటలకు రోడ్డుపై లారీ, కారు దిగబడటం తో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అంటివలస నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రానికి పేషెంట్‌ను తీసుకెళుతున్న 108 వాహనం ట్రాఫిక్ జాంలో గంటల తరబడి ఉండిపోయింది. దీంతో పేషెంట్‌ను మోసుకుని ట్రాఫిక్ ఆవల వైపు ఉన్న ఆటోపై జిల్లా కేంద్రాసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఐదేళ్లుగా ఈ నరక యాతన పడుతున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరం. కొమరాడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది వచ్చి జేసీబీని తెచ్చి భారీ లారీని తీసిన తర్వాత మధ్యాహ్నం 12.30 గంటలకు యథావిధిగా వాహనాలు నడిచాయి. ఇకనైనా ఉన్నతాదికారులు, ప్రభుత్వ పెద్దలు కళ్లు తెరిచి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేయాలని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు.


నిలిచిన 108 వాహనాన్ని చూపుతున్న సాంబమూర్తి

క్లుప్తంగా..

మద్యం సీసాల స్వాధీనం

పార్వతీపురంటౌన్: అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. పట్టణంలో ని బెలగాం గూడ్స్‌షెడ్ రోడ్డులో మురళి అనే వ్యక్తి గురువారం అక్రమంగా 114 మద్యం సీసాలను రవాణా చేస్తుండగా వలపన్ని పట్టుకున్నామని చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని అరెస్టు చేశామన్నారు.

వరద బాధితులకు సాయం


లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న వీరేశ్

కురుపాం: విజయవాడ వరద బాధితులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మంగళగిరిలోని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి, రూ.5లక్షలను విరాళంగా అందజేశారు.

సిరివరలో వైద్య సేవలు

సాలూరు రూరల్: కొదమ పంచాయతీ గిరిశిఖర గ్రామం సిరివరలో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం తోణాం పీహెచ్‌సీ సిబ్బంది ఆ గ్రామానికి చేరుకుని 58 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శి ఎర్రాయుడు ఆధ్వర్యంలో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. ఫాగింగ్ చేయించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకి సన్మానం


ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి తన స్వగ్రామమైన తాడికొండలో ఆ గ్రామస్థులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే దంపతులకు సలువా కప్పి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

కురుపాం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ రవణమ్మ గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సిలబస్ ఎంతవరకు పూర్తి చేశారని హెచ్‌ఎం టి.శంకరరావుకు అడిగి తెలుసుకున్నారు.

ఏచూరి మృతి తీరని లోటు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతి కమ్యూనిస్టుల ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. గురువారం ఆయన మృతికి సంతాపం తెలుపుతూ జిల్లాలో పలుచోట్ల నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఏచూరి గొప్ప మానవతావాది, ఆర్థికవేత్త అని కొనియాడారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.


సాలూరు: సీతారాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు


బెలగాం: ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


మక్కువ: నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగునాయుడు

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు గడువు పెంపు

గరుగుబిల్లి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఈనెల 15వ తేదీలోగా చేరవచ్చని మండల సార్వత్రిక విద్యా పీఠం సమన్వయకర్త పెదిరెడ్డి శ్రీనువాసరావునాయుడు, పక్కి సదాశివరావులు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీసాయి నికేతన్ హైస్కూల్‌లో గురువారం వీరు విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఈనెల 25వ తేదీలోగా అపరాధ రుసుం రూ.200 ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం గడువు పెంచిందని చెప్పారు. ఈనెల 25వ తేదీలోగా అపరాధ రుసుంతో చేరేందుకు అవకాశం కల్పించారని తెలిపారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు


సీతంపేట రూరల్: అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: ఎన్‌కే రాజపురంలో ఏర్పాటుచేసిన వినాయకుడిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ● **సీతంపేట రూరల్:** పెదరామ గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదానంలో ఎమ్మెల్యే జయకృష్ణ పాల్గొన్నారు. అనంతరం గ్రామ సమీపంలో శిథిలా వస్థలో ఉన్న వంతెనను పరిశీలించారు. నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామస్థులు ఎమ్మెల్యేను సన్మానించారు.

మంచు దుప్పటి



పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు పొగమంచు కమ్ముకుంది. వర్షాకాలం ముగుస్తుండడంతో.. చలికాలం ప్రారంభంలో జిల్లాలో పొగమంచు కమ్ముకోవడం ప్రకృతి సహజం. పొగమంచు వల్ల వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు కాస్త ఇబ్బంది పడ్డారు.